సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 5 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ నియోజకవర్గాల్లో ఆయా నేతల సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. - 8లో



కిరాతక కొడుకు కటకటాలకు

అన్నదమ్ములకు ఆస్తిని సమానంగా పంచి ఇవ్వలేదన్న కోపంతో తల్లిదండ్రులపై దాడిచేసి, కర్కశంగా వ్యవహరించిన కిరాతక కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.80	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 83 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	365	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1051.580 కిలోలు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రాయచోటి : జిల్లాలో మూడో రోజున ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం జిల్లాలోని 54 పరీక్ష కేంద్రాల్లో 16443 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిలో 15529 మంది హాజరుకాగా 914 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి కృష్ణయ్య చెప్పారు. ఒకేషనల్ పరీక్షకు 1438 మందికి 1308 మంది విద్యార్థులు సోమవారం పరీక్షలు రాసినట్లు డీఐఈఓ తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

రాయచోటి : రాయచోటిలోని పద్మావతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణ గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిణి, పరీక్షల ఇన్విజిలేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్షల నిర్వహణ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఆర్జీలను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటని నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.

బీఐఎస్‌పై అవగాహన తప్పనిసరి




మాట్లాడుతున్న పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హాల్‌మార్క్‌పై ప్రతిఒక్కరూ అవగాహనను పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఎం.ధనలక్ష్మి అన్నారు. సోమవారం రాయచోటి ఎంపీడీఓ సభాభవనంలో జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నాలుగురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఉదయం బి.కొత్తకోట, గాలివీడు, చిన్నమండెం, చిట్వేల్, మధ్యాహ్నం కలికిరి, కలకడ,కె.వి.పల్లె, గుర్రంకొండ మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ బీఎస్‌ఐ హాల్‌మార్క్ ఉన్న వస్తువులను మాత్రమే గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం కొనుగోలు చేయాలని సూచించారు. ఈనెల 7వ తేదీ వరకు కొనసాగే శిక్షణకు జిల్లాకలెక్టర్ జారీచేసిన షెడ్యూలు ప్రకారం ఆయా మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024–25 కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ పునీత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు అగ్నివీర్ జనరల్‌డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీసు, అసిస్టెంట్, స్టోర్‌కీపర్, టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్ మ్యాన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి సోమవారం ఉదయం ఆలయ తలుపులు తెరవగానే ఉదయించే సూర్యుడు నేరుగా స్వామిని (శివలింగాన్ని) తాకుతూ పైపైకి వచ్చాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానిక భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి నెల మొదటి వారంలో ఇలా జరుగుతుందన్నారు. అలనాడు గుడిని శిల్పకళానైపుణ్యంతో నిర్మించడం వల్ల ఇలాంటి దృశ్యాలు కనిపిస్తాయని తెలిపారు.

మెనూ అదిరింది

- హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం
- ప్రతి రోజూ ఉదయమే పాలు
- ప్రతి విద్యార్థికి నెలకు రూ.150 నుంచి రూ.200 పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు	:55
విద్యార్థులు	:4000
బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు	:33
విద్యార్థులు	:2704
పోస్టుమెట్రిక్ వసతి గృహాలు	:12
విద్యార్థులు	:900

డైట్ చార్జీల వివరాలు

తరగతి	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
3–4	రూ.1000	రూ.1150
5–10	రూ.1250	రూ.1400
ఇంటర్మీడియట్ (ఆ పైన)	రూ.1400	రూ.1600

కాస్మోటిక్ చార్జీలు

3 –6 (బాలురు)	రూ.100	రూ.125
(బాలికలు)	రూ.110	రూ.130
7–10 (బాలురు)	రూ.125	రూ.150
(బాలికలు)	రూ.160	రూ.200
ఇంటర్ ఆపైన (బాలురు)	రూ.155	రూ.200
బాలికలు	రూ.160	రూ.250



మదనపల్లె బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మెనూ విషయంలో ప్రత్యేక దృష్టి సారించింది. భోజనంలో పలు మార్పులు తీసుకువచ్చిన ప్రభుత్వం ప్రతి రోజూ ఉదయం పాలు, మల్టీవిటమిన్ చిక్కీలు, సాయంత్రం సమయంలో సేమ్యా పాయసం, ఉడికించిన పల్లీలు, రాగి లడ్డూ, మరమరాలు, రవ్వ కేసరిని అందిస్తోంది. ఇందుకు అనుగుణంగా టీడీపీ హయంలో ఉన్న డైట్ చార్జీలను కూడా పెంచింది. ప్రస్తుతం గతంతో పోలిస్తే ప్రతి విద్యార్థికి నెలకు రూ.150 నుంచి రూ.200 వరకు ప్రభుత్వం పెంచింది. టీడీపీ హయంలో ప్రభుత్వ హాస్టళ్లు అంటేనే ఉడికీ ఉడకని అన్నం, నీళ్లచారు.. ప్రస్తుతం ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు రకరకాల వంటకాలు, ఉదయం 7 గంటలకు పాలు, టిఫిన్‌కు పూరి, పులిహోరా, ఇడ్లీ, ఉప్మా, పొంగలి తదితర వాటిని వడిస్తుండగా, రాత్రి ప్రతి రోజు ఉడకబెట్టిన గుడ్లు, అరటిపండు, అన్నం, ఆకు కూర, పప్పు, సాంబారు, పల్లీల చట్నీ, సాయంత్రం స్నాక్స్‌గా వేరుశనగ చిక్కీలు ఇలా ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఆదివారం మధ్యాహ్నం విధిగా చికెన్ బిర్యానీ పెడుతున్నారు. గతంలో వారంలో రెండు పర్యాయాలు మాత్రమే చికెన్ పెట్టే వెసులు బాటు ఉండేది. ప్రస్తుతం వారంలో మూడు సార్లు (ఆది, మంగళ, శుక్రవారాల్లో) చికెన్ పెడుతున్నారు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 20వ తేదీన మెస్‌చార్జీలను పెంచుతూ జీఓఎంఎస్ నంబర్ 8 జారీ చేసింది. మెస్ చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలను కూడా పెంచింది. ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూను పక్కాగా అమలు చేస్తుండటం వల్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఏ పూటకాపూట ఫొటోలు తీసి జిల్లాలోని సంక్షేమశాఖకు చెందిన అధికారులతో పాటు రాష్ట్ర అధికారులకు అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

ఇది కదా.. అభివృద్ధి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సంక్షేమ వసతి గృహాల్లో ఓ వైపు పౌష్టికాహారాన్ని అందిస్తూనే మరో వైపు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతి వసతి గృహ సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎంలు ప్రతి వారం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నారు. ప్రతి నెలా సమీపంలో పిహెచ్‌సీ వైద్య సిబ్బంది వసతిగృహాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మెనూ తప్పక పాటించాల్సిందే



ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ తప్పకుండా పాటించాలి. దీనికి సంబంధించి ఆకస్మిక తనిఖీలు కూడా చేస్తున్నాం. విద్యార్థుల చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం.

– బి.నందప్ప, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. మెనూలో మంచి భోజనంతో గుడ్లు, చికెన్ బిర్యానీ, చిక్కీలు అందిస్తున్నారు. ఇలాంటి మెనూ గతంలో ఎన్నడూ చూడలేదు. మాలాంటి వాళ్ల గురించి ఆలోచిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– లవకుమార్, 9వ తరగతి, బీసీ హాస్టల్,మదనపల్లె.

శభాష్ వలంటీర్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇస్తోంది. ఎన్ని పనులున్నా.. ఎంతటి ముఖ్యమైన పనినైనా పక్కనపెట్టి అవ్వాతాతలకు సకాలంలో పింఛన్ అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లె గ్రామానికి చెందిన పున్నాటి శంకర్‌రెడ్డి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతను తిరుపతి స్విమ్స్ అసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు.విషయం తెలుసుకున్న వలంటీర్ గుణవతి సోమవారం తిరుపతికి వెళ్లి శంకర్‌రెడ్డికి పింఛన్ సొమ్ము రూ.10 వేలు అందజేసింది.



పుల్లంపేట : పుల్లంపేట మండలం, కొండంపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపాక సుబ్బరాయుడు అనారోగ్యంతో తిరుపతిలోని రష్ అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ శిరీషా 120 కిలోమీటర్ల దూరం వెళ్లి సుబ్బరాయుడుకు పింఛన్ అందించింది.గర్భిణిగా ఉన్న ఆమె తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా వెళ్లి పింఛన్ అందజేసింది. పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి వలంటీర్‌కు అభినందనలు తెలిపారు.



నందలూరు(రాజంపేట) : కర్నూలులోని ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కి చెందిన దండు పెంచలయ్యకు వలంటీర్ రేగిమడుగు కుమార్ కర్నూలుకు వెళ్లి పెన్షన్, ఆరోగ్యశ్రీ కార్డు అందజేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన ఖరారు

7, 8 తేదీల్లో పులివెందులలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 7, 8 తేదీల్లో ఆయన పులివెందులలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన వివరాలిలా ఉన్నాయి.

7వ తేదీన

- సాయంత్రం 4.00 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 4.05 గంటలకు అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4.25 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 4.30 గంటలకు వైఎస్సార్ మెమోరియల్ పార్కుకు చేరుకుంటారు.
- 4.30 నుంచి 4.50 గంటల వరకు వైఎస్సార్ మెమోరియల్ పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 4.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.55 గంటలకు ఇడుపులపాయ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

8వ తేదీ

- ఉదయం 8.20 గంటలకు ఇడుపులపాయ గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 8.25 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 8.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8.40 గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 8.45 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 8.55 గంటలకు డాక్టర్ వైఎస్సార్ గవర్నమెంటు జనరల్ ఆస్పత్రికి చేరుకుని ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో 9.35 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి రహదారి మార్గంలో బయలుదేరి 9.45 గంటలకు బనాన ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్‌కు చేరుకుంటారు. ప్యాక్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 10.00 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు డాక్టర్ వైఎస్సార్ మినీ సెక్రటేరియేట్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు.
- 10.25 గంటల వరకు మిని సెక్రటేరియేట్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 10.30 గంటలకు డాక్టర్ వైఎస్సార్ జంక్షన్ వద్దకు చేరుకుంటారు. 10.35 గంటల వరకు జంక్షన్ ప్రారంభోత్సవంలో గడుపుతారు. 10.35 నుంచి 10.40 గంటల వరకు సెంట్రల్ బౌల్ వార్డ్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 10.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.50 గంటలకు వైఎస్ జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు.
- 11.00 గంటల వరకు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 11.05 గంటలకు గాంధీ జంక్షన్‌కు చేరుకుని 11.10 గంటల వరకు జంక్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 11.15 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ వద్దకు చేరుకుంటారు.
- 11.40 గంటల వరకు లేక్ ఫ్రంట్ ప్రారంభోత్సవంలో గడుపుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 11.50 గంటలకు ఆదిత్య బిర్లా యూనిట్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.05 గంటల వరకు ఆదిత్య బిర్లా యూనిట్ ఫేస్–1 ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 12.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12.15 గంటలకు హెలిప్యాడ్ సమీపంలోని సంయూ గ్లాస్ వద్దకు చేరుకుంటారు.
- 12.20 గంటలకు టేక్ ఆఫ్ తీసుకుని 12.40 గంటలకు కడప ఎయిర్‌పోర్టులో దిగుతారు.
- 12.50 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 1.40 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 1.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.10 గంటలకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.

మంగంపేట గనుల సందర్శన




మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఓబులవారిపల్లె : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారి మంగంపేట ఏపీఎండీసీ గనులను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సోమవారం సందర్శించారు. మంగంపేట బెరైటీస్ ఖనిజం వెలికితీత, తదితర అంశాల గురించి సీపీఓ సుదర్శన్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మంగంపేట ఆర్‌ఆర్–5 పునరావాస కాలనీ పనులను కలెక్టర్ పరిశీలించారు.మ్యాప్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు ఆర్‌ఆర్–5 లేఅవుట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగంపేట ఆర్‌ఆర్–5కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు, తహశీల్దార్ శేషగిరిరావు, ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో..హాయివే!

శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరునగరికి.. శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదం లభించింది. జాతీయరహదారుల ప్రాధికారసంస్థ(ఎన్‌హెచ్ఐ) టెండర్ల ప్రక్రియపూర్తి చేసింది. 130 కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణం ఉంటుంది. దీనిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది.

- సురక్షిత ప్రయాణానికి కడప-రేణిగుంట ఫోర్‌లైన్
- ప్రాజెక్టు వ్యయం రూ.2,350 కోట్లు
- ఒకటిన్నర గంటలో తిరుపతికి పయనం



హైవే నిర్మాణ క్యాంప్‌ల పనులు

రాజంపేట : శేషాచలం అటవీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన ప్రయాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి.ఇందులో భాగంగా 716 కడప-రేణిగుంట జాతీయరహదారిని త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. రూ.4వేల కోట్లు వివిధ పనుల రీత్యా కేటాయించింది. ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ.2,350 కోట్లుగా నిర్ణయించింది. గత ఏడాది జూలైలో కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కడప-రేణిగుంట ఫోర్‌లైన్ నిర్మాణపనులను లక్ష్మీఇన్‌ఫ్రా నిర్మాణ సంస్థ చేపట్టేందుకు క్యాంప్‌లను సిద్ధం చేసుకుంటోంది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతికి..

- కడప-రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకోవచ్చు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారు కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.
- కడప-రేణిగుంట రహదారిలో రాజంపేట, రైల్వేకోడూరులో బైపాస్ రహదారి నిర్మించాలని యోచిస్తున్నారు. ముంబై-చెన్నై రైలుమార్గం వెంబడి (పడమర వైపు)భాకరాపేట చిన్నఓరంపాడు వరకు మార్గం నిర్మితం కానుంది. ఈమార్గం పూర్తిగా అటవీమార్గంలోనే కొనసాగుతుంది. మార్గమధ్యలో ఆర్వోబీలు, చెయ్యేరునదిపై వంతెన, చిన్న చిన్న బ్రిడ్జిల నిర్మాణం ఉన్నాయి.



భూసేకరణ జరిగిన ప్రాంతాలివే..

కడప, చింతకొమ్మలదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట, నాగిరెడ్డిపల్లె, పాటూరు(నందలూరు), రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, శెట్టిగుంట(రైల్వేకోడూరు)

హైవే నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

- కడప-రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్ల లక్ష్యంగా ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎంపీ ప్రయత్నిస్తున్నారు.
- ఫారెస్టు, వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కడప-రేణిగుంట నేషనల్ హైవేకు త్వరలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వనున్నాయి. నెలలోపు ఈ అనుమతులు వస్తాయని ఎన్‌హెచ్ వర్గాల సమాచారం. అనుమతులు రాగానే నిర్మాణపనులు పూర్తి చేస్తారు. అటవీశాఖ నుంచి దాదాపు 300 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తొమ్మిది మండలాల్లో 1,790.180 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగింది. అటవీశాఖ ఇప్పటికే డీమార్కేషన్, ఎన్యూమరేషన్ పూర్తి చేసింది. కేంద్రానికి నివేదిక వెళ్లింది.
- జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసు రోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి వెళ్లే యాత్రీకులు ఒంటిమిట్ట రామయ్య, సౌమ్యనాథుని దర్శించుకోవడం ఇటీవల అధికమైంది. అంతేగాకుండా రాయలసీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధరామాలున్నాయి. పర్యాటకపరంగా ప్రాచుర్యం పొందిన ఒంటిమిట్ట, నందలూరుకు ఎన్‌హెచ్ నుంచి ప్రత్యేకంగా సర్వీసురోడ్డు నిర్మితం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డిని ఇది వరకే వైఎస్సార్‌సీపీ నేతలు కోరిన సంగతి తెలిసిందే. హైవే రావడం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. సర్వీసురోడ్డుగా మారునున్న రహదారిలో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

ఫోర్‌లేన్ ఇలా..

- రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్న రహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందుభాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరపేట పడమరదిశగా ఫోర్‌లైన్ వెళ్లనుంది

త్వరలో అటవీ అనుమతులు



ఫారెస్టు, వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అటవీశాఖ అనుమతుల కోసం కృషిచేస్తున్నాం. త్వరలోనే అనుమతులు రానున్నాయి. రెండు ప్యాకేజీలుగా కడప-రేణిగుంట జాతీయరహదారి నిర్మాణపనులు జరుగుతాయి. గ్రీన్‌హైవే ఎక్స్‌ప్రెస్‌లో ఆహ్లాదకరమైన వాతవరణంలో త్వరితగతిన గమ్యాలకు చేరుకువచ్చు.

– పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

సురక్షిత ప్రయాణం



తొలిగడప కడప నుంచి తిరుపతికి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం వల్ల రద్దీ క్రమబద్ధీకరణవుతుంది. ఈ మార్గంలో స్పెషల్ సర్వీసు రోడ్డు నిర్మితం చేయాల్సి ఉంది. ఉభయ వైఎస్సార్ జిల్లా వాసులే కాకుండా, ఉత్తరభారతదేశానికి చెందిన వారు సకాలంలో తిరుపతి, చెన్నైలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. అటవీ అనుమతులు రాగానే నిర్మాణసంస్థ పనులు చేపడుతుంది.

– మేడారఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

క్లుప్తంగా

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు స్వామి వారి పారువేటతో ముగుస్తాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. భక్తులకు తాగునీరు, భోజనంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు.

వంచకుడి అరెస్టు

బి.కొత్తకోట : ప్రేమపేరుతో బాలికను వంచించి అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. బి.కొత్తకోట పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలికను ఓ బాలుడు నమ్మించి తీసుకెళ్లి అఘాయిత్యం చేశాడు. దీనిపై బాధిత బాలిక వాంగ్మూలం మేరకు నిందితుడిని మండలంలోని కాండ్లమడుగు క్రాస్‌లో అరెస్ట్ చేసి తిరుపతి జువైనల్ హోంకు తరలించామన్నారు.

ఇసుక క్వారీలో డ్రైవర్ల ధర్నా

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి ఇసుక క్వారీలో సోమవారం వాహనాల డ్రైవర్లు ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ధరలు తగ్గించామని చెబుతున్నా క్వారీ వద్ద కాంట్రాక్టర్లు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు ధర్నాకు దిగారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక



గుర్రంకొండ మండలం తరిగొండ, టి.రాచపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ, టి.రాచపల్లె పంచాయతీల పరిధిలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కుటుంబాల వారు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో పర్యటించారు. తరిగొండ, పిల్లగోవులవారిపల్లె, ఇరగన్నగారిపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు చోటా, గఫూర్, ప్రసాద్, జాఫర్, కిట్టూ, రాజా, పవన్, అంజికుమార్, అనిల్‌కుమార్, ప్రసాద్, నరసింహులు, రామకృష్ణ, చీకటిపల్లి నరసింహులు, సూరి, శంకరయ్యలతో పాటు మొత్తం 55 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. టి.రాచపల్లె గ్రామానికి చెందిన మొర్రంరెడ్డి యల్లారెడ్డితోపాటు మరో 25 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపీపీ జమీర్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అప్పల్ల, ఎల్వీరమణ, తరిగొండ ప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నీళ్ల శ్రీనివాసులు, సర్పంచ్‌లు యల్లారెడ్డి, విశ్వనాథ్, జగన్‌మోహన్, ఎంపీటీసీలు గంగులమ్మ, సరస్వతి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, సురేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కేవీపల్లె : మండలంలోని తువ్వపల్లెలో 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం మాజీ సర్పంచ్ చిరసాని వెంకటరమణారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిరసాని పురుషోత్తంరెడ్డి, చీపాటి నాగిరెడ్డి, నడివీధి పెద్దిఇరగంరెడ్డి, చిరసాని వెంకటరమణారెడ్డి, మిట్టపల్లె ఇరగంరెడ్డి, మిట్టపల్లె వెంకటరమణారెడ్డి, మిట్టపల్లె పద్మనాభరెడ్డి, మిట్టపల్లె చిన్నప్పరెడ్డి, మిట్టపల్లె ద్వారకనాథరెడ్డి, యలకమాని అశోక్‌కుమార్‌రెడ్డి, రాళ్లమడుగు రమేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ ఆనంద్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ రెడ్డి, నాయకులు సతీష్‌రెడ్డి, గజ్జెల శీనీరెడ్డి, రాంప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలకడ మండలంలోని వడ్డిపల్లి, కదిరాయచెరువు, చిన్నగోగులవారిపల్లి, బొంతలవారిపల్లికు చెందిన టీడీపీ నాయకులు సుంకర వెంకట్రమణ, కత్తి రామచంద్ర, రామమోహన్ గౌడ్, హరినాథ ఆధ్వర్యంలో 35 కుటుంబాలు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు జీవీ కిషోర్, నాయకులు సుధాకర్ నాయుడు, పుల్లయ్యగౌడ్, చిరంజీవి యాదవ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

రాయచోటి : జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పదోతరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటిలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంవత్సరం పదోతరగతికి ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయని, అందులో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఒక్కొక్కటి 50 మార్కులకు ఉంటాయని చెప్పారు. పరీక్షలలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా విద్యార్థులు స్వేచ్ఛగా భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. తిరుపతి ఉప విద్యాశాఖ అధికారి ఆనందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నపత్రాలు బయటకు పంపకుండా జాగ్రత్తలు చూసుకోవాలని తెలిపారు. మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ ప్రశ్నపత్రాల ట్రాన్స్‌పోర్ట్ సమయంలో, జవాబుపత్రాలు ప్యాకింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీసీఈబీ సెక్రటరీ కె.నాగమునిరెడ్డి మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ ఆదేశానుసారం విద్యార్థులకు సమయానికి ప్రశ్నపత్రాలు అందించేలా చూడాలన్నారు. ఎస్.రామకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరీక్ష విధానంపై అందరికీ అవగాహన కల్పించారు. ఏఎంఓ సుంకర రామకృష్ణ, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



నేను పులివెందుల పట్టణంలోని రోటరీపురంలో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నాను. గత టీడీపీ, కాంగ్రెస్ పార్టీల హయాంలో ఇంటి కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసిన కొన్ని నెలల్లోనే నాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. మా ఆయన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జగనన్న కాలనీలో ఇల్లు పూర్తి అయితే ఆ కాలనీలో చేరుతాం.

- నాగలక్ష్మి, పులివెందుల

సర్వాంగ సుందరంగా పాఠశాలలు



సర్వాంగ సుందరంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా పాఠశాల భవనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారు. నాడు.. నేడు కింద ఈ భవనాలు శాశ్వతంగా పక్కా నాణ్యతతో నిర్మించడం ఎంతో సంతోషకరం. పేదింటి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం ఈ భవనాలను ఎంతో మెచ్చుకుంటున్నారు. సీఎం జగన్ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు.

- ఎన్.నాగమల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, చిన్నమండెం

పల్స్‌పోలియోను తనిఖీ చేసిన స్టేట్ నోడల్ ఆఫీసర్

రాయచోటి అర్బన్ : పల్స్‌పోలియో రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా గృహ సందర్శనలను సోమవారం స్టేట్‌నోడల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్‌కుమార్ తనిఖీ చేశారు.

బూడిదగుంటరాచపల్లె, ఒదివీడు, కుమ్మరపల్లె గ్రామాలలో పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఇంటింటి సర్వేను సక్రమంగా చేస్తున్నారా? మార్కింగ్ వేస్తున్నారా లేదా? అంటూ ఆరా తీశారు. రాయచోటి అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని గుడారాలు, ఇటుక బట్టీల వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారా? లేదా? అని తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ భానుప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు తదితరులు ఉన్నారు.

కోనంపేట క్వారీలో బాంబ్ బ్లాస్ట్ : యువకుడి మృతి



మృతి చెందిన శివారెడ్డి

లక్కిరెడ్డిపల్లె : కోనంపేట గ్రామ సమీపంలోని మురళి కంకర మిషన్ క్వారీలో ఆదివారం జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో ముద్దనూరుకు చెందిన శివారెడ్డి(28) అనే యువకుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్వారీలో జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో మృతి చెందిన శివారెడ్డిని స్థానికులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ.విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా ముద్దనూరుకు చెందిన శివారెడ్డి(28) అనే యువకుడు క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడటంతో మృతి చెందినట్లు తెలిపారు.

దొంగగా మారిన డెలివరీ బాయ్

- రూ.10 లక్షల విలువైన నగలు, ద్విచక్రవాహనం స్వాధీనం
- చోరీ కేసులో శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా వాసి అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి



చోరీ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె : ఫుడ్ డెలివరీ కోసం గ్రామానికి వచ్చిన డెలివరీబాయ్.. ఇంటి తాళం దాచిపెట్టడాన్ని గమనించి, తర్వాత దర్జాగా తాళంతో ఇంట్లోకి చొరబడి రూ.10లక్షల విలువైన నగలు, రూ.52వేలు నగదు చోరీ చేసుకువెళ్లిన ఘటన మండలంలోని అంకిశెట్టిపల్లెలో జరిగింది. చోరీ జరిగిన ఘటనపై సోమవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ప్రసాదరెడ్డి వివరాలను వెల్లడించారు. శ్రీ పొట్టిశ్రీరాములు జిల్లా మనుబోలు మండలం అక్కంపేటకు చెందిన హజరత్ కుమారుడు షేక్ అజారుద్దీన్(23) జీవనోపాధిలో భాగంగా మదనపల్లెకు వచ్చి జోమోటోలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అంకిశెట్టిపల్లెకు బిర్యానీలు ఆర్డర్ వస్తే డెలివరీలకు వెళుతుండేవాడు. అంకిశెట్టిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్‌రెడ్డి గ్రామ సమీపంలో ఇటుకల ఫ్యాక్టరీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పూట అంకిశెట్టిపల్లెలోని ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులు అందరూ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 7న.. రెడ్డిశేఖర్‌రెడ్డి తల్లి నారాయణమ్మ తనకు సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు, నగదును తమ ఇంటిపై బీరువాలో పెట్టి, బీరువా తాళాలు అల్మారాలో పెట్టి, మెయిన్‌డోర్‌కు తాళం వేసి, కుటుంబ సభ్యులు ఎవరైనా వస్తే అందుబాటులో ఉండేలా కిటికీలో తాళాలు పెట్టి ఫ్యాక్టరీకి వెళ్లింది. అదే సమయంలో అంకిశెట్టిపల్లెకు బిర్యానీ ఆర్డర్ ఇచ్చేందుకు వెళ్లిన షేక్‌అజారుద్దీన్ తాళాలు కిటికీలో పెట్టడాన్ని గమనించాడు. కాసేపు అక్కడే ఉండి, కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదని నిర్ధారించుకుని, కిటికీలోని తాళాలు తీసుకుని, మెయిన్‌డోర్ తెరచి, ఇంట్లోకి వెళ్లి అల్మారాలోని తాళాలు తీసుకుని, బీరువా తెరచి, అందులోని రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.55వేల నగదు చోరీచేసి తన ద్విచక్రవాహనంలో ఉడాయించాడు. మరుసటి దినం ఇంటికి వెళ్లిన రెడ్డిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తెరచి ఉండటం, అందులోని నగలు, ఆభరణాలు లేకపోవడాన్ని గుర్తించి, చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన తాలూకా పోలీసులు విచారణలో డెలివరీ బాయ్ దొంగతనానికి పాల్పడినట్లు కేసును ఛేదించారు. తట్టివారిపల్లె నాలుగురోడ్ల జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు షేక్ అజారుద్దీన్‌ను అరెస్ట్‌చేసి, అతడి వద్ద నుంచి 150 గ్రాముల బంగారునగలు, 200గ్రాముల వెండినగలు స్వాధీనం చేసుకున్నారు. నేరం సమయంలో ఉపయోగించిన ద్విచక్రవాహనం టీఎస్–08, జేఆర్–5702ను సీజ్ చేశారు. సమావేశంలో తాలూకా సీఐ ఎన్.శేఖర్, ఎస్ఐ రవికుమార్, స్పెషల్ టీం రాఘవ యాదవ్, హర్ష, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

మదనపల్లె : సోదరుడితో గొడవ పడి మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి వాల్మీకిపురంలో జరిగింది. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో నివాసం ఉన్న వేణుగోపాల్ ఆచారి భార్య వి.యువరాణి(50) తండ్రి కృష్ణమూర్తి, తల్లి విజయలక్ష్మితో కలిసి ఉంటోంది. ఆమెకు 1996లో అనంతపురానికి చెందిన వేణుగోపాల్ ఆచారితో వివాహం కాగా, సంతానం కలగలేదన్న కారణంతో 2006లో భార్యాభర్తలు విడిపోయారు. అప్పటి నుంచి వాల్మీకిపురంలో తల్లిదండ్రులతో కలిసి యువరాణి జీవిస్తోంది. కరోనా సమయంలో భర్త వేణుగోపాల్ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మదనపల్లెలో నివసిస్తున్న సోదరుడు ఆనంద్‌కుమార్‌తో తల్లిదండ్రులను చూసుకునే విషయంలో తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో ఆదివారం ఉదయం వాల్మీకిపురం వచ్చిన ఆనంద్‌కుమార్‌తో ఇంట్లో యువరాణి గొడవకు దిగింది. రాత్రి 7గంటల సమయంలో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న విషద్రావణం అన్నంలో కలుపుకుని తిని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ఆదివారం రాత్రి 11గంటలకు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ, ఆమె మృతి చెందింది. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

బైక్ ను ఢీకొన్న ఆటో

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. నారమాకుల తండాకు చెందిన దిలీప్ నాయక్(27) తన భార్య మునీశ్వరి (25) కుమారుడు యశ్వంత్ నాయక్(04)లతో కలసి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చారు. మునీశ్వరి గర్భిణిగా ఉండడంతో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుని అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని బొమ్మను చెరువు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో మునీశ్వరి కాలు విరిగి తీవ్రంగా గాయపడగా, భర్త దిలీప్ నాయక్ కుమారుడు యశ్వంత్ నాయక్‌లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వాహనాలను అడ్డుకున్న నిర్వాసితులు

ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీ గనులలో సోమవారం వాహనాలను ఆర్ఆర్ 5 నిర్వాసిత కుటుంబాల వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసిత కుటుంబాల తరపున పులపత్తూరి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ 5 మంగంపేట కాపుపల్లె గ్రామస్తులకు పరిహారం, పునరావాసం, ఉపాధి కల్పనలో ఆలస్యం జరుగుతోందన్నారు. అర్హత ఉండి ప్యాకేజీలు రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. దీనిపై సీపీఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వల్ల కొంత మందికి పరిహారం రాలేదని రెండు మూడు రోజుల్లోనే వారికి పరిహారం అందుతుందని తెలిపారు. దీంతో గ్రామస్తులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పులపత్తూరి సుదర్శన్‌రెడ్డి, దేవేంద్రనాథ్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, జైభరత్‌రెడ్డి, సాయిప్రశాంత్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కోటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్‌కు గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ(32) తనకు పరిచయస్థుడైన కల్యాణ్(24)తో కలిసి ద్విచక్రవాహనంలో కడపలోని యూనివర్సిటీకి బయలుదేరాడు. మార్గమధ్యంలోని మదనపల్లె తట్టివారిపల్లె క్రాస్‌వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో లెక్చరర్ బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీతోనే క్రైస్తవ సంక్షేమం

వైఎస్సార్‌సీపీ క్రైస్తవవిభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసిజాన్‌బాబు

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రైస్తవుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న కాలంలో పాస్టర్లకు గౌరవవేతనం పెంపు, దళిత క్రైస్తవులకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు, క్రైస్తవ సమాధులకు, ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. మదనపల్లెలో దాదాపు 8,000మందికి పైగా క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వారందరూ వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటించారన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కోర్ కమిటీ చైర్మన్, అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ వైఎస్ విమలారెడ్డి, సీఎం ప్రత్యేక మైనారిటీ సలహాదారు బాలస్వామి, ఏపీ క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షుడు మేడే జాన్సన్ తదితరులు మార్చి రెండో వారంలో మదనపల్లెలో జరగనున్న దైవజనుల సమావేశానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ ప్రతినిధులు ఆనంద్, రమేష్, రెడ్డిశేఖర్, బి.జాన్సన్, దేవమణి, విజయ్‌కుమార్, జీవరత్నం, దివాకర్, ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాయచోటి: స్పందన ద్వారా వచ్చే ప్రజల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఏఎస్పీ వీబీ రాజ్ కమల్ జిల్లాలోని పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వరం న్యాయం చేకూర్చాలని వీడియో కాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా నలుమూలల నుంచి స్పందనకు 56 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన దుంగలు, వాహనాలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రాయచోటి/గాలివీడు: అన్నమయ్య జిల్లా పరిధిలోని సురభి ఫారెస్టు బీటులో అక్రమంగా తరలిస్తున్న 28 ఎర్రచందనం దుంగలతోపాటు వ్యాను, మోటారు సైకిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరొక్కరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలోని రైల్వేకోడూరు సబ్ డివిజన్ ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ రాఘవేంద్ర టీమ్ ఆదివారం తనిఖీలు చేపట్టింది. గాలివీడు మండలం, గువ్వలచెరువు సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున సురభి ఫారెస్టు బీటు పరిధిలోని హిందుకూరవాండ్లపల్లి తూముకుంట మెయిన్ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న లగేజీ వాహనంలోని వారు టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూడగానే వాహనాన్ని తిప్పుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటపడటంతో వాహనాన్ని వదిలి పారిపోతుండగా వారిలో ఇద్దరిని పట్టుకున్నారు. వారిని గాలివీడు మండలానికి చెందిన పచ్చిపాల యోగీశ్వర నాయుడు (33), ఇర్రి పెద్దిరాయుడు (20)గా గుర్తించారు. మరో వ్యక్తి పారిపోగా అతనికోసం గాలిస్తున్నారు. వాహనంలోని 28 ఎర్రచందనం దుంగలను, మోటారు సైకిల్‌ను సాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కిరాతక కొడుకు కటకటాలకు

వృద్ధదంపతులపై దాడి కేసులో అరెస్టు



శ్రీనివాసులురెడ్డిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మదనపల్లె : అన్నదమ్ములకు ఆస్తిని సమానంగా పంచి ఇవ్వలేదన్న కోపంతో తల్లిదండ్రులపై విచక్షణారహితంగా దాడిచేసి, కర్కశంగా వ్యవహరించిన కిరాతక కుమారుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు మదనపల్లి డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ గుంతవారిపల్లెకు చెందిన పెద్దకాము వెంకటరమణారెడ్డి(82), లక్ష్మమ్మ(72) దంపతులు ప్రస్తుతం మదనపల్లె టౌన్ అయోధ్యానగర్‌లో నివసిస్తున్నారు. వీరికి మనోహరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి అనే ఇద్దరు కుమారులతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరికి స్వగ్రామంలో 3 ఎకరాల పొలం, 2 ఎకరాల డీకేటీ పొలం ఉంది. శ్రీనివాసులురెడ్డి చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు డీకేటీ భూమి 2 ఎకరాలను పెద్దకుమారుడు మనోహర్‌రెడ్డి భార్య పేరుమీద ఉంచారు. దీంతో ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలన్నీ పెద్దకుమారుడు మనోహర్‌రెడ్డి కుటుంబానికే దక్కుతున్నాయి. దీంతో డీకేటీ భూమిలో తనకు రావాల్సిన వాటాను పంచాల్సిందిగా రెండేళ్లుగా శ్రీనివాసులురెడ్డి తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. పలుమార్లు తల్లిదండ్రులను కొట్టడం, వారు పోలీసులకు ఫిర్యాదుచేయడం జరిగేదన్నారు. ఈ క్రమంలో.. ఈనెల 2న అయోధ్యనగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన శ్రీనివాసులురెడ్డి డీకేటీ భూమికి పాసుపుస్తకాలు తన పేరు మీదకు మార్చకపోవడం, స్వగ్రామంలో ఇల్లు కట్టించకపోవడం తదితర విషయాలపై గొడవకు దిగాడు. ఆవేశంతో ఊగిపోతూ, వృద్ధులని కనికరం లేకుండా కన్నతల్లిదండ్రులపై పైశాచికంగా దాడికి పాల్పడ్డాడు. తల్లిని ఎదరొమ్ముపై తన్నుతూ, జుట్టు పట్టి ఈడ్చుకెళుతూ, తీవ్ర గాయాలపాలుచేశాడు. వయోభారంతో కుమారుడి చేష్టలను అడ్డుకోలేక, చూస్తూ కూర్చున్న తండ్రిని సైతం చెంపలపై కొడుతూ మూర్ఖుడిలా వ్యవహరించాడు. ఈ తతంగాన్ని అక్కడే ఉంటున్న పెద్దకుమారుడు మనోహర్ రెడ్డి కుమార్తె యామిని వీడియో తీసింది. తర్వాత బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీడియో సామాజికమాధ్యమాల్లో వైరల్ కావడంతో, అన్నమయ్యజిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో... టూటౌన్ సీఐ యువరాజ్, ఎస్ఐలు ఇనాయతుల్లా, వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి నిందితుడిపై కేసు నమోదుచేశారు. బాధితులను జిల్లా ఆస్పత్రిలో పరామర్శించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి, సోమవారం అయోధ్యనగర్ సమీపంలో నిందితుడు శ్రీనివాసులురెడ్డిని అరెస్ట్‌చేశారు. రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.